కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు కుట్టుమిషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం కల్పనలో భాగంగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మలకపేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శుక్రవారం మూసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్‌లో గల సలీం ఖాన్ కమ్యూనిటీహాల్‌లో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న దాదాపు వందమంది మహిళలకు ఆయన సర్టిఫికెట్లతో పాటు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు, స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలందరికీ కుట్టుమిషన్లను అందజేస్తున్నామని, వీటి ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం మలకపేట మహిళ ఇన్‌చార్జి నజీమా, స్థానిక నాయకులు నాగరాజు, సుమన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.


అధికారులతో ఒడిశా ఆయుర్వేద రిటైర్డ్ వైద్య బృందం

ఎన్‌ఐఐఎంహెచ్‌ను సందర్శించిన ఒడిశా వైద్య బృందం

సైదాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్‌ఐఐఎంహెచ్)ను డాక్టర్ శిశిర్‌కాంత్ మిశ్రా నేతృత్వంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన పది మంది రిటైర్డ్ ఆయుర్వేద వైద్య అధికారుల బృందం శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మిశ్రా, అతడి సతీమణి సుస్మిత మిశ్రాలు ఎన్‌ఐఐఎంహెచ్‌కు సుమారు 400 సంవత్సరాల పురాతన మూడు కల్వములను, రెండు రాయితో చేసి రోకళ్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి గోలి పెంచల ప్రసాద్, రీసెర్చ్ ఆఫీసర్లు(ఆయుర్వేదం) డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ క్రిస్ మురళీమనోహర్, లైబ్రేరియన్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


చతుర్వేద సభలో ప్రవచనాలు చేస్తున్న హరిసీతారామ్మూర్తి సలక్షణ ఘనపాఠి

కోలాహలంగా చతుర్వేద సభ, వేదస్వస్తి

మన్సూరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వేద హవనం సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం బ్రహ్మశ్రీ హరిసీతారామ్మూర్తి సలక్షణ ఘనపాఠి అధ్యక్షతన చేపట్టిన చతుర్వేద సభ, వేదస్వస్తి, వేదాశీర్వచనం, పండిత సన్మాన కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. వైదిక విజ్ఞాన ట్రస్టు, ధర్మరక్ష సంస్థ ఆధ్వర్యంలో జనప్రియ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

31న మహా నవగ్రహ పూజలు

చాదర్‌ఘాట్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ శాలివాహన నగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 31న మహా నవగ్రహ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు కాటూరి శ్రీను స్వామి తెలిపారు. రాహు కేతు దోషం, కాలసర్ప దోషం, కుజ దోషం, అష్టమ శని, అర్థాష్టమి శని దోష నివారణ కోసం ఈ మహా నవగ్రహ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. నవగ్రహ పూజా కార్యక్రమంలో తొమ్మిది మంది బ్రాహ్మణులు, తొమ్మిది రకాల వస్త్రాలు ధరించి తొమ్మిది రకాల ధాన్యం పోసి తొమ్మిది కలశాలు పెట్టుకుని నక్షత్ర జపం, నవగ్రహ జపం, నవగ్రహ దానం, నవగ్రహ స్తోత్రంతో పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

నేడు వీరబ్రహ్మంగారి విగ్రహావిష్కరణ

సరూర్‌నగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు కట్టపై ప్రతిష్ఠించిన పోతులూరి వీరబ్రహ్మంగారి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు మీర్‌పేట్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి తెలిపారు. బ్రహ్మంగారి మఠం 8వ తరం వంశానికి చెందిన వారసుడి మునిమనవడు వీరభద్రస్వామి చేతుల మీదుగా శనివారం ఉదయం 11గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని ఆయన చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆలయంపై వీరశైవుల ఆధిపత్యం చెల్లదు

● భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయ కమిటీ సభ్యులు

వనస్థలిపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయ నిర్వహణ హైకోర్టు సూచించిన విధంగానే కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తుందని దీనిపై కొంతమంది వీరశైవుల ఆధిపత్యం చెల్లదని ఆలయ కమిటీ గౌరవ చైర్మన్ ఎం.వీ శేఖర్, అధ్యక్షుడు గాండ్ల అంజయ్య తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆలయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ 1979లో తొలిసారి ఇక్కడ ఆంజనేయస్వామి గుడి నిర్మాణం, 1989లో శివాలయం, విజయదుర్గ అమ్మవార్ల ఆలయాలను కాలనీకి చెందిన సుమారు రెండు వందల మంది అన్ని కులస్థులు, దాతలు, భక్తుల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించి దినాదినాభివృద్ధి చేశామన్నారు. కానీ ఇటీవల కాలంలో కొంత మంది వీరశైవులు వచ్చి వారికి నచ్చిన విధంగా ఆలయ కమిటీని ప్రకటించుకుని అజమాయిషీ చెలాయించాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ప్రకటించుకున్న ఆలయ కమిటీ చెల్లుబాటు కాదన్నారు. పురాతనమైన ఈ ఆలయం కాలనీకి చెందిన పార్కు స్థలంలో కాలనీవాసులందరం కలిసి నిర్మించామన్నారు. కేవలం ఒకే కులానికి చెందిన ఆలయంగా మార్చడానికి చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. ఇప్పటికే హైకోర్టు ఈ ఆలయం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించిందని, ఇతరులు వచ్చి ఆలయ ప్రతిష్ఠతకు ఆటకం కలిగించే ఆలోచనలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, కోశాధికారి ఉప్పు వెంకటేష్, సహాయ కార్యదర్శి నరేంద్రకుమార్, సభ్యులు శీనయ్య, అశోక్‌కుమార్, మహేష్, సత్యమూర్తి, వేణు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష


భార్గవ్‌కుమార్

సైదాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసి బెదిరింపులు, వేధింపులకు పాల్పడ్డ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు 12వ అదనపు సెషన్స్ జడ్జి టి.అనిత శుక్రవారం తీర్పునిచ్చారు. హరిజనబస్తీలో నివాముండే ఓ బైక్ డ్రైవర్ అమీందాల భార్గవ్‌కుమార్ అలియాస్ చింటూ (36)కు భార్య, కూతురు ఉన్నారు. బాలికను మాయమాటలతో నమ్మించి యాదగిరిగుట్టకు తీసుకువెళ్లి లాడ్జిలో అత్యాచారం చేశాడు. బాలికతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు తండ్రికి పంపించి పెళ్లి చేయాలని బెదిరించసాగాడు, అతడి వేధింపులు భరించలేక బాలిక తండ్రి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి అనిత శుక్రవారం తీర్పునిచ్చారు.


ఆర్‌కేపురం చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తదితరులు


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, చిత్రంలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్, దరిపల్లి తదితరులు


బడంగ్‌పేట్‌లో మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

మన్సూరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ ఎల్బీనగర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యురాలు షాలిని పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణకు ఆద్యుడు మన్మోహన్‌సింగ్: పారిజాతారెడ్డి

సరూర్‌నగర్: మన్మోహన్‌సింగ్ ఆర్థిక క్రమశిక్షణకు ఆద్యుడిగా నిలిచారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ పారిజాతారెడ్డి మాట్లాడుతూ ఆచరణీయమైన ఆర్థిక సంస్కరణలు, సమాచార హక్కుచట్టం వంటివి ఆయన పాలనలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టాలని అన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎం.హన్మంత్‌రెడ్డి, వి.సుభాన్‌యాదవ్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కె.శ్రీరాంరెడ్డి, ఎన్.మల్లారెడ్డి, డి.శ్రీనివాస్‌గౌడ్, పి.ఆనందరెడ్డి పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో..

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు మాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్లు రాంచందర్, మల్లేశ్‌ముదిరాజ్, నాయకులు రవినాయక్, ఓంప్రకాశ్, జానయ్య బాలకృష్ణగౌడ్, రాజేశ్‌రెడ్డి మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు.

ఎల్‌బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని శ్రీరామకృష్ణాపురం చౌరస్తాలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు బండి మధుసూదన్‌రావు, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ సురేష్‌కుమార్, గట్ల రవీంద్ర, రమేష్, ఎన్ఎస్‌యూఐ శివ, దుర్గాప్రసాద్, భూపాల్‌రెడ్డి, జగన్నాథం, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, యాదవరెడ్డి, మహేందర్, కల్యాణ్, లింగస్వామిగౌడ్, ఎల్లన్న, జ్ఞానేశ్వర్, ఏవీరావు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద

సరూర్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బోయిని శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్‌అలీ, యువజన కాంగ్రెస్ నేత యూనస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరుణ, వార్డు కమిటీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, లోడి నర్సింహగౌడ్, కిషోర్, నర్సింగ్, అంబేడ్కర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.

హయత్‌నగర్, తుర్కయంజాల్‌లలో..

హయత్‌నగర్: హయత్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, స్థానిక మున్సిపాలిటీ కౌన్సిలర్లు కొశిక ఐలయ్య, కుటం ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, నారని కవితాశేఖర్‌గౌడ్, నాయకులు సామ భీంరెడ్డి, కొంతం వెంకట్‌రెడ్డి, మేకల పాండు, లోహిత్‌రెడ్డి, మేక రాము పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు చౌరస్తా వద్ద

హయత్‌నగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు చౌరస్తా వద్ద స్థానిక పార్టీ నాయకుడు గజ్జి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో గోవర్ధన్‌నాయక్, పారంద స్వామి, బోడ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట చౌరస్తాలో శుక్రవారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గారెడ్డి, తోకటి కిరణ్, సురేందర్, రాజశేఖర్‌రెడ్డి, కారుకొండ శివ, గణేష్, రణధీర్‌రెడ్డి, రఘు, సుజాత, యాదమ్మ, సరిత, అనిత పాల్గొన్నారు.


చంపాపేట చౌరస్తాలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఆలయ మాజీ చైర్మన్ రఘుమారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

హస్తినాపురంలో..

కాంగ్రెస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు దెంది శశిదర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్‌లోని జడ్పీరోడ్‌లోని శ్రీరమణకాలనీ వైజంక్షన్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మెరుగు రమేష్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, లతగౌడ్, షాకీర్, బ్రహ్మరెడ్డి, ప్రసాద్, నరేందర్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామ చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : సింగరేణికాలనీ చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నగర కార్యదర్శి లడ్డు పటేల్, శశియాదవ్, నేతలు రవిరాజ్, వెంకటమ్మ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వనస్థలిపురం : వనస్థలిపురంలోని కాంప్లెక్స్ చౌరస్తాలో ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులతో ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, బుడ్డ సత్యనారాయణ, నాయకులు సాయి నికేష్, ఉమేష్‌గౌడ్, స్వర్ణమాధవి, దాము మహేందర్, వెంకటేష్‌గౌడ్, వేణు పాల్గొన్నారు.


బాలాపూర్ చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు


చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

ప్రతి పనిలోనూ విశ్వకర్మలు కీలకం

● ఎంపీ ఈటల రాజేందర్

ఎల్‌బీనగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయం, దుస్తులు ఆఖరికి ఇల్లు కావాలన్నా.. జీవించడానికి కావాల్సిన ప్రతి ప్రధాన పని విశ్వకర్మలతోనే ముడిపడి ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. అఖిలభారత విశ్వకర్మ మహాసభను అధ్యక్షుడు కౌలె జగన్నాథం అధ్యక్షతన కొత్తపేట బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈటల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వకర్మల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ సాధన ఉద్యమంలో ప్రాణాలర్పించిన శ్రీకాంతాచారిలే ఇందుకు నిదర్శనమన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీకి గుజరాత్ రాష్ట్రంలో అత్యంత సన్నిహితంగా ఉన్న వర్గాలు విశ్వకర్మలేనన్నారు. విశ్వకర్మల ఆర్థికాభివృద్ధి కోసం ప్రధాని మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన గుర్తు చేశారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో 25లక్షల జనాభ కలిగి ఉన్న విశ్వకర్మలు కులవృత్తులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. తెలంగాణ వస్తే కులవృత్తులకు తోడ్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారని ఆశపడ్డారని తొమ్మిదేళ్ల కాలంలో పాలకులు విశ్వకర్మల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. జగన్నాథం మాట్లాడుతూ విశ్వకర్మ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిన వృత్తి కళాకారులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. బ్యాంకు గ్యారెంటీ లేకుండా రూ.25లక్షల వరకు వ్యక్తిగత రుణం ఇప్పించాలని కోరారు. రాష్ట్ర రాజధానిలో కేటాయించిన 5ఎకరాల స్థలంలో రూ. 200కోట్లతో అన్ని వసతులతో విశ్వకర్మ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతిభకనబర్చిన విశ్వకర్మ చేతి వృత్తిదారులకు గౌరవ పురస్కారాలు ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, పవన్‌కుమార్, విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు చెడ్డిలాల్‌శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దినేష్‌బాయ్‌శర్మ, ఉపాధ్యక్షుడు ఎంఎం శర్మ, నాయకులు మనోరంజన్, రాజశేఖర్, కృష్ణగంజ్, సూర్యనారాయణ, గులాబ్‌శర్మ, చెన్నయ్యచారి, లింగాచారి, మురళీధర్‌చారి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

లెప్రసీ కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, బాలాజీనగర్ లెప్రసీ కాలనీల్లో సొసైటీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) ఆధ్వర్యంలో శుక్రవారం లెప్రసీ కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, వెంకటేశ్వర్, టీఎస్ రాష్ట్ర స్లాప్ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు అనసూయ చేతుల మీదుగా 53 లెప్రసీ కుటుంబాలకు సరుకులతో పాటు దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్యామేల్, రహిమతుల్లా, మల్లయ్య పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి ఎస్‌బీఐ వితరణ

సైదాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్ బీ కాలనీలోని కోదండ రామాలయానికి సోలార్ సిస్టంకు ఏర్పాటుకు రూ.2.50లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు అనుమతి పత్రాలను శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ రావికంటి శ్రీనివాస్‌గుప్తాకు ఎస్‌బీహెచ్ గడ్డిఅన్నారం శాఖ మేనేజర్ అరుంధతి, ఏజీఎం పద్మజ అందజేశారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ పథకం కింద ఆలయంలో 5కేవీ సోలార్ సిస్టం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని మేనేజర్ అరుంధతి తెలిపారు. అదేవిధంగా గతంలో ఆలయానికి ఆర్వో ప్లాంటును అందజేశామని వివరించారు. ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం బ్యాంకు అధికారులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు లక్ష్మీప్రభు, కృష్ణమురళీ, సుబ్రహ్మణ్యం, సంజీవరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భార్యపై అలిగి.. భర్త అదృశ్యం


గోకల వెంకటేష్

హయత్‌నగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భార్యపై అలిగిన భర్త డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి ఇంత వరకు తిరిగి ఇంటికి రాని సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూరు రవిశంకర్‌కాలనీలో నివాసం ఉండే గోకల వెంకటేష్ బుధవారం తన అన్న పోకల గ్రాబెల్‌ను క్రిస్మస్ పండగకు ఆహ్వానించడానికి వెలుదామని భార్య పల్లవిని అడిగాడు. అందుకు భార్య తనకు ఆరోగ్యం సరిగా లేదు. మీరు వెళ్లండని అనడంతో మనస్థాపానికి గురైన వెంకటేష్ అదేరోజు ఉదయం 11గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో పల్లవి ఇంటి ఓనర్ వద్ద ఫోను తీసుకుని భర్తకు ఫోన్ చేసింది. దీంతో వెంకటేష్ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మరుసటి రోజు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో పల్లవి బంధువుల వద్ద స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చంపాపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కో సం ప్రయాణికులు డయల్‌యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కంచన్‌బాగ్‌లోని మిధానీ ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, డిపో పరిధిలోని ఆయాకాలనీలు, బస్తీల ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను ఫోన్ ద్వారా (9959226139) తెలుపాలని డీఎం కోరుతున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సకినాల నరేష్‌కుమార్

హయత్‌నగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ భరించలేక మనస్థాపానికి గురైై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ బొమ్మగుడి సమీపంలోని విష్ణునగర్‌కాలనీలో నివాసం ఉండే సకినాల నరేష్‌కుమార్(36) మెడికల్ ఫీల్డ్‌లో వ్యాపారం చేస్తాడు. వ్యాపారంలో డబ్బులు పెట్టడానికి అనేక మంది వద్ద అప్పుచేశాడు. వ్యాపారంలో లాభాలు రాక నష్టపోయాడు. దీంతో అప్పులబాధ భరించలేక శుక్రవారం భార్య ప్రియాంక డ్యూటీకి వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేష్‌కుమార్ తల్లి దుర్గమ్మ చూసి కోడలుకు ఫోన్‌చేసి చెప్పింది. నరేష్‌కుమార్‌ను వెంటనే వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మృతిచెందినట్లు చెప్పారు. నరేష్‌కుమార్‌కు కూతురు, కుమారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగిన నేరాలు.. ప్రమాదాలు

క్రైం రౌండప్ 2024

● దొంగతనాలను ఛేదించడంలో పోలీసుల వైఫల్యం..?

హయత్‌నగర్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): నగర శివారు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నేరాల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి కొన్ని గ్రామాలను వేరు చేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్, ఇటీవల మరో మూడు గ్రామాలైన తట్టిఅన్నారం, కుత్బుల్లాపూర్, గౌరెల్లిలను హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి తొలగించి నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో కలిపినప్పటికీ క్రైం రేటు మాత్రం తగ్గడం లేదు. హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్, మునగనూర్, కొహెడా పరిసర ప్రాంతాల్లో కొత్తగా కాలనీలు ఏర్పాటు అవుతుండడంతో జన సంఖ్య కూడా విపరీతంగా పెరుగుతుంది. అందులో భాగంగానే సంవత్సరపు సగటు నేరాల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో వరుసగా 2022 నుంచి 2024 వరకు నమోదైన ఎఫ్ఐఆర్‌ల సంఖ్య(క్రైం రేటు) ఇలా ఉంది. 2022లో 814 ఉండగా, 2023లో 1390, 2024లో డిసెంబర్ 26 వరకు క్రైం రేటు 1582కు చేరుకుంది. మరో నాలుగు రోజుల్లో సుమారు 20 కేసులు నమోదు అయ్యే అవకాశం ఉంది. 2024 సంవత్సరం పూర్తి వరకు హయత్‌నగర్ పీఎస్ పరిధిలో సుమారు 1600 కేసులు నమోదు అయ్యే అవకాశం ఉంది. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం 200 కేసులు ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉంది.



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్(ఫైల్)

పెరిగిన రోడ్డు ప్రమాదాలు.. మిస్సింగు కేసులు

గత సంవత్సరం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం సంఖ్య 1390 ఉండగా ఈ సంవత్సరం డిసెంబర్ 26 వరకు 1582గా నమోదు అయింది. అంటే దాదాపు 192 కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయి. గత సంవత్సరం 127 రోడ్డు ప్రమాదాలు జరగగా ఈ సంవత్సరం 183 జరిగాయి. 27 మంది మృత్యువాత పడ్డారు. 165 మంది గాయపడ్డారు. హత్యలు- 4, కిడ్నాప్‌లు 23, మిస్సింగ్‌లు 220, చైన్‌స్నాచింగ్‌లు-5, రేప్ కేసులు- 13, దోపిడీలు- 2, ఇంటి తాళాలు ధ్వంసం చేసినవి- 50 కలుపుకుని మొత్తం దొంగతనాలు- 233 కేసులు నమోదు అయ్యాయి.

58 శాతం సొత్తు రికవరీ చేసిన పోలీసులు

మొత్తం 233 దొంగతనాల్లో 135 దొంగతనాలను పోలీసులు ఛేదించారు. దొంగతనాల్లో రూ.1,96,16,859 లక్షల సొత్తు చోరీకి గురి అయింది. అందులో పోలీసులు రూ. 1,09,21,500 లక్షలను రికవరీ చేశారు. ఈ లెక్కన పోలీసులు 58 శాతం సొమ్మును రికవరీ చేయగలిగారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగాయి. దొంగతనాలను ఛేదించడంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. పీఎస్ పరిధిలోని అన్ని ప్రధాన చౌరస్తాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. పండగల వేళల్లో ప్రజల సహకారంతో గస్తీని మరింత పెంచాం. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రులకు తరలిస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి మత్తు పదార్థాలు నగరానికి రాకుండా పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేశాం. రాచకొండ కమిషనర్ ఆదేశాలతో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

- పల్స నాగరాజుగౌడ్, హయత్‌నగర్ సీఐ

భారీగా మత్తు పదార్థాలు పట్టుకున్న పోలీసులు

హయత్‌నగర్ పోలీసులు భారీ మొత్తంలో మత్తు పదార్థాలను ఔటర్ రింగు రోడ్డు కేంద్రంగా పట్టుకున్నారు. దాదాపు 26 కిలోల గంజాయి, 26కిలోల లిక్విడ్ గంజాయి, 80 గ్రాముల హెరాయిన్ డ్రగ్స్‌ను పట్టుకుని సీజ్ చేశారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ. కోటి 50లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.